# చెట్టు పగ తీర్చుకుంది

## -పురిజాల సుధాకర్



"చెట్లు కొట్టడం మహాపాపం చిన్నానా... వాటికీ ప్రాణం వుంది కాబట్టి వాటిని చంపడం నీకు న్యాయం కాదు:.. అని నిష్కర్షగా చెప్పాను."

నా తత్వం చిన్నప్పటినుంచీ అంతే!

ఒక్కసారి ఇప్పుడు మారమంటే మారదు.

ముక్కుసూటిగా, చెరుకుముక్క తెగ్గొట్టినట్టు మాట్లాడడం నా అలవాటు. నేను మా వూరు పదేళ్ళ తర్వాత వెళ్లాను.

నేను తోట చూద్దామనే కుతూహలం పట్టలేక వెళ్లాను.

నాకు చాలా బాధనిపించింది.

తోటలో చాలా చెట్లు మా చిన్నాన్నలు ఇద్దరూ కలిసి పట్నంలో డిపోల వాళ్లకి అమ్మేసారు. ఒక్కొక్క చెట్టు కనీసం వెయ్యి రూపాయిలకు తక్కువ లేకుండా అమ్మేసారు. వాటిని ఆ వ్యాపారులు కొట్టేసి లారీల్లో పట్టుకుపోయారట. సుమారుగా సగానికిపైగా చెట్లన్నీ కైంకర్యం చేసేసి చెరిసగం ఖచ్చితంగా పంచుకున్నట్లు తెలిసింది. అంటే చెట్లని కేష్ చేసేసుకున్నారన్నమాట. ఉద్యోగాల నిమిత్తం పట్నాల్లో ఉండే మా నాన్నగారిలాంటి మిగతా ఆరుగురు అన్నదమ్ములకి ఏమీ దక్కకుండా చేసారు. భ్రాతృద్రోహులు... కనీస వాటా అయినా ఇవ్వలేదు. ఈ విషయం ఏ ఒక్కరూ తెలియచేయలేదు. చెట్ల ఫలాలు పీకలదాకా తిన్నారు. ఇప్పుడవి కాపుకాయడం మానేసరికి కొట్టించేస్తున్నారు.

"వృక్షాలే దేశానికి రక్షరా...

వృక్షాలే దేశప్రగతి చిహ్నాలు..."

"పచ్చనైన వృక్షం... ప్రగతికే సోపానం"

"ఇంటింటికి ఒక చెట్టు, నాటి మమత చూపెట్టు."

ఇలాంటి స్లోగన్స్ అన్నీ నా మనసులో మెదిలాయి.

వాళ్లకి పాపభీతి ఎందుకు లేదు? చెట్లని చంపడం అంటే మనుషుల్ని చంపడంతో సమానమని ఎందుకు తలచరు? దుర్మార్గులు... ఇటు సాటి అన్నదమ్ములకి అన్యాయం చెయ్యడమేగాక అటు వాటి ప్రాణాలు తీసారు. ఇది దుస్సాహసం. వీళ్ళకి పెద్దన్నలంటే భయం లేదు. తమ్ముళ్లంటే ఖాతరు లేదు.

"అవునురా గౌరిగా... ఇక్కడ పెద్ద మర్రిచెట్టు వుండేదిగదారా..." గతుక్కుమని అడిగాను.

"అవును బాబూ... నాలుగు నెలల క్రితం మీ చిన్నాన్న ఇచ్ఛాపురం నుండి వచ్చాడు. మీ ప్రసాదు చిన్నాన్న అతనూ కలిసి ఎనిమిదివేల రూపాయిలకి అమ్మేసారు. ఆళ్లు అడ్వాన్సు ఇచ్చిన వెంటనే కొట్టేసారు బాబూ..." తోట కాసే గౌరిగాడు చెప్పాడు.

నేను తోటలో వుంటున్నప్పుడే మా చిన్నాన్న తన మూడు మామిడి చెట్లు కొట్టించేస్తున్నాడు.

అతనికి తనా పరా భేదం లేదనిపించింది. ఆ చెట్లు కొమ్మలు విశాలంగా వున్నాయి. వాటి కాండం గుండ్రంగా బోలెడు కలప దిగేలా ఉంది.

ఒక్కొక్క చెట్టుకీ కనీసం నూరు సంవత్సరాలు వయసుంటుంది.

అవును... ఈ తోటలను మా ముత్తాత వేసారు. ఆయన తన పిల్లలు, పిల్లల పిల్లలు తరతరాలుగా తినాలనే ఉద్దేశంతో వేశారు. రెండు మామిడి తోటలు, ఒక కొబ్బరి తోట, పనస చెట్లు అన్నీ వేయించారు.

ఎందరో ఈ పళ్లు తిన్నారు.

ఎందరో ఈ తోటలవల్ల బాగుపడ్డారు.

ఇప్పటికీ పంతులుగారి తోటనే పేరుంది.

ఇటువంటి తోటల్లో ఒక తోటను ఒక్క చెట్టు కూడా మిగలకుండా పనసచెట్లతో సహా, ఇతర చెట్లతో సహా అన్నీ అమ్మేసారు. ఆఖరికి సగం వాటా భూమి కూడా అమ్మేసారు.

మా ముత్తాతగారికి ఇద్దరు కొడుకులు.

ఆ ఇద్దరికీ నలుగురేసి కొడుకులు.

ఆ ఎనమండుగురికీ ఇదిగో మేము సుమారుగా ముప్ఫయ్ మంది మనుమలం.

అప్పుడు ఆస్తి అంతా రెండు భాగాలయ్యింది. ఆ రెండు భాగాలు ఎనిమిది భాగాలయ్యింది.

ఆ భాగాల్లో తోటలూ వాటాలే గదా!

కానీ ఈ తోటలు రెండు వాటాలుగానే వుండిపోయాయి. తర్వాత మిగతా ఆరుగురూ పట్నాల్లో ఉద్యోగాల నిమిత్తం చేరుకున్నారు. ఏదో ఏడాదికోసారి కాస్త ధాన్యం పట్టుకెళ్లడం తప్ప ఈ తోటల్ని పట్టించుకునే తీరిక ఓపిక ఎవరికీ లేకపోయింది.

ఒక చిన్నాన్న పూర్తిగా వ్యవసాయదారుడిగా వుండిపోగా మరో చిన్నాన్న ఊళ్లో చిన్న పోస్ట్‌మేన్‌గావుంటూ వ్యవహారాలు చక్కపెట్టే వాడన్నమాట. సరయిన ఆదాయం లేని ఈ చెట్ల మీద వీళ్ల పాపిష్టి దృష్టి పడింది. ఎంత విశ్వాస ఘాతకులు? తల్లి రొమ్మునే బాదే రకాలు, వాటి పళ్లు తిని వాటినే నరికేశారంటే వీళ్లని ఏమనుకోవాలి?

నూరేళ్ల ఫలాలు ఇచ్చాయి. ఇంకా ఎలా ఇస్తాయి. వాటి వయసు ఉడిగిపోయాక ఫలాలు ఎలా ఇస్తాయి? అంతమాత్రాన వాటిని చంపేస్తారా?

ఓ ప్రక్క ప్రభుత్వం చెట్లు పెంచండీ అని అంటుంటే మా చిన్నాన్నలు మాత్రం చెట్లు నరకండో అన్నట్లు ఒక తోటంతా తిరగతోసేశారు. మరో తోట మీద పడ్డారు. దీంట్లో అప్పుడే మర్రిచెట్టులాంటి ఇతర చెట్లు కూల్చేసారు.

ఎంత బాధపడినా చేసేది ఏం వుంది? గత పదేళ్లుగా రాకపోవడం నాదీ తప్పేగదా? చూసుకోకపోవడం, ఈ ఇద్దర్నీ పూర్తిగా నమ్మడం తప్పేకదా మరి! ఆల్ రెడీ కొట్టేసినవి కొట్టేయగా కేవలం 78 చెట్లు మాత్రం మిగిలివున్నాయి. వీటినైనా కాపాడే ప్రయత్నం చెయ్యాలి అనుకొని ఇంటికి వచ్చేసాను. మా చిన్నాన్న మాత్రం కొడుతున్న చెట్ల దగ్గరే వుండిపోయాడు.

"బాబూ భోజనానికి రారా" పిన్ని పిల్చింది.

"అలాగే" కాళ్లు కడుగుతున్నాను.


"తోట చూసి వచ్చావా ?"

"అవును పిన్నీ"

"బాధపడ్డావా?"

"చాలా బాధపడ్డాను పిన్నీ!"

తోటను సంరక్షించే వారే లేరు బాబు... మీ పోస్ట్‌మేన్ చిన్నాన్న ఇచ్ఛాపురం ప్రమోషన్ వచ్చి వెళ్ళిపోయాడు. ఈ చిన్నాన్నకి వ్యవసాయం గదా! ఊర్లో పేదవాళ్లంతా తోటలో కర్రలు కొట్టేయడం అమ్మేసుకోవడం మొదలుపెట్టారు. తోటకాసే గొరిగాడూ వాటి స్వార్థంవాడు చూసుకోసాగాడు. ఈ ఊళ్లో నాయుళ్లే చెరుకు గానుగలు ఆ తోటలో వేస్తూ చెట్లను రాక్షసంగా కాల్చేస్తున్నా వీళ్లు పట్టించుకోలేదు. పచ్చటి చెట్లు మాడిపోతుంటే బాధపడేదాన్ని. చుట్టూ కంచె ఏనాడోపోయింది. బండి త్రోవలూ ఏర్పడ్డాయి. రకరకాలుగా ఆ తోటను అందరూ ఉపయోగించుకునేవారు. ఈ పరిస్థితుల్లో మొదట మామూలు చెట్లు నరకడం ప్రారంభించి, మామిడి చెట్లూ నరికెయ్యసాగారు. అలాగే ఖజ్జ, పనస, బురదపనస, నేరేడు, దాచి, రేగుచింత, మర్రి, గుగ్గిలం,టేకులాంటి విలువైన చెట్లు అమ్మేసారు. లారీలు లారీల కలప మాకళ్లముందే పట్నాలకు పోతోంటే ఆడదాన్ని ఏం చెయ్యగలను? ఇదిగో ఆఖరికి మిగిలిన ఆరుగురికీ 13 చెట్ల చొప్పున మాత్రం మిగిలాయి. అవేనా మీరు కాపాడుకోండి, వీళ్ల పాత చెట్ల స్థానే కొత్త చెట్లు వేస్తారా అంటే అదీ లేదు. మీ చిన్నాన్నకి వయసు పెరిగింది గాని బుద్ది పెరగలేదు. మీ పోస్ట్‌మేన్ చిన్నాన్నకి ఇచ్ఛాపురంలో వున్నా దృష్టంతా చెట్ల మీదే! వాటిని చంపగా వచ్చిన ఆదాయం మీదే సుమారుగా లక్ష రూ॥ కు పైగా తనూ కేష్ చేసుకున్నాడట!




"........."

"బాబూ... నేనిప్పుడు 60 ఏళ్ల వృద్ధురాల్ని చెట్లుకి నూరు ఏళ్లు దాటాక ఫలాల్నివ్వడం మానేస్తే వీళ్లు చంపేస్తున్నారు. పనికిరాదనే గదా ఆ పని చేస్తున్నారు. ఒక వేళ మనిషయినా అంతేనా? వృద్ధాప్యం వచ్చినంత మాత్రాన చంపేయడమేనా? వృద్ధాప్యం అనేది చెట్టు అయినా, మనిషి కయినా ఒకటే గదా... అది సహజం కదా... ఇక పనికిరాకపోతే చంపేసే అధికారం, చెట్లను చంపే అధికారం ఈ మనుషులకెవరిచ్చారురా?"

నేను స్టన్ అయ్యాను.

ఆమె ఆలోచనాధోరణి నన్ను ఆశ్చర్యపరిచింది.

"ఛఛ... మనుషులకీ చెట్లకీ ఒక్కటేనా?" అన్నాను ఆమెను ఊరడిస్తూ.

"మరేంటయ్యా... చెట్లు ఏం చేశాయి వీళ్లని? ఏం అన్యాయం చేసాయని ఇలా నరికేస్తున్నారు? నువ్వైనా చెప్పు బాబూ.... అలా చెట్లుని నరకొద్దని" ఆమె చాలా బాధగా అంది.

"అలాగే" అన్నాను చెయ్యి కడుక్కుంటూ.

సరిగా

ఆ సమయంలోనే

తోటలోంచి ఎవడో గాభరాగా వచ్చి చెప్పాడు.

"అమ్మా... అయ్యగోరిమీద ఆ మామిడి కొమ్మ బలంగా పట్టు తప్పి పడిందమ్మా... తోటలో ఆ పెద్ద కొమ్మ కిందపడి చచ్చిపోయారమ్మా..."

పిన్ని ఏడుస్తూ గబగబా పరుగెత్తింది.

నేను దగ్గరలోనే వున్న తోటకి పరుగెత్తాను.

చాలా బరువైన పెద్ద మామిడి కొమ్మక్రింద మా చిన్నాన్న తల బ్రద్దలై ఉంది. ఆ దృశ్యం హృదయవిదారకంగా ఉంది.

అప్పుడు

అనిపించింది నాకు

చెట్లు పగ తీర్చుకుంటాయా అని!

ఎట్లాగయితేనేం మా చిన్నాన్న శవాన్ని ఆ బరువైన కొమ్మ క్రింద నించి సుమారు పదిమంది బయటకు లాగారు.

ఈ విషయం ఇచ్ఛాపురంలో వున్న పోస్ట్‌మేన్ చిన్నాన్నకు టెలిగ్రామం ఇవ్వడం కోసం నేను ఆఫీసుకి పరుగెత్తాను. మెసేజ్ ఇలా ఇచ్చాను.

"చెట్టు పగతీర్చుకుంది స్టార్ట్"